సాక్షి చిత్తూరు

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో 20న దీపావళి ఆస్థానం సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. - IIలో



జీఎస్టీపై అవగాహన

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. - IIలో



కాసుల వైద్యం

ప్రైవేటు ఆస్పత్రులు రోగులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. ప్రైవేటు వైద్యంపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. - IIలో

న్యూస్‌రీల్

ప్రతిభకు ప్రోత్సాహం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు కౌశల్ ప్రతిభా అన్వేషణ పోటీలు దోహదపడతాయని డీఈవో వరలక్ష్మి అన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో కౌశల్ పోటీ పరీక్షల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు కౌశల్ 2025 క్విజ్ పోటీలకు సిద్ధం చేయాలన్నారు. భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ సైన్స్ సిటీ, ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 8,9,10 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో 27, 28 తేదీల్లో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. జిల్లా సమగ్ర శిక్షా శాఖ ఏఎంసీ వెంకటరమణ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలు, సృజనాత్మకతను వెలికితీసేందుకు కౌశల్ క్విజ్ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వరరావు, ఎంఈవోలు హసన్‌భాషా, గణపతి, కౌశల్ పోటీల నిర్వాహకులు దామోదర్‌రెడ్డి, అరుణ్ కుమార్, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 79,919 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 28,218 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.79 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెన్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టోకెన్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులను నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తిచేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

వినాయక సదన్ తనిఖీ

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని వినాయక సదన్‌ను గురువారం ఈఈ వెంకట కిషోర్ తనిఖీ చేశారు. పాత సదన్‌తో పాటు కొత్తగా సముదాయాన్ని పరిశీలించారు. ఆ భవనంలోని ఫర్నిచర్ కాంటిల్స్‌ను కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంపూర్తి ప్రాజెక్టుల నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ హయాంలో పలమనేరు నియోజకవర్గంలో మూడు ప్రాజెక్టులు నిర్మాణానికి పూనుకుంది. వీటిలో కొన్నింటికి భూసేకరణ పూర్తయి టెండర్ల దశలో ఆగిపోగా మరికొన్ని వివిధ దశల్లో పనులు కోవిడ్ తదితర కారణాలతో నిలిచిపోయాయి. కానీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి ఊసే ఎత్తకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. గత ఎన్నికల్లో అనంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చంద్రబాబు, ప్రస్తుత ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హామీలు గుప్పించారు. కానీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

- గత ప్రభుత్వంలో ఎక్కడ ఆగాయో అక్కడే పనులు
- అనంపూర్తి ప్రాజెక్టు పనులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- 200 వందల ఎంసీఎఫ్‌టీ నీటిని ఒడిసిపట్టలేని వైనం
- ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్న హామీ విస్మరించిన చంద్రబాబు
- గత ఎన్నికల హామీ గాలికొదిలేసిన ప్రభుత్వం



వెంగంవారిపల్లి అడవిలో ప్రవహిస్తున్న నది

ప్రాజెక్టులపై కినుక !

పలమనేరు : జిల్లాలోని పడమటి ప్రాంతమైన పలమనేరులో సాగు, తాగునీటికి బోర్లపైనే ఆధారపడాల్సిందే. వర్షాలు కురిసినప్పుడు చిన్న నదులు ప్రవహిస్తుంటాయి. అయితే ఆ నీటిని ఒడిసిపట్టే ప్రయత్నాలను అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. కౌండిన్య నదిపై కాలువపల్లి వద్ద వైఎస్సార్ హయాంలో జలాశయాన్ని నిర్మించారు. ఆపై వచ్చిన కిరణ్ కుమార్‌రెడ్డి, చంద్రబాబు సర్కార్ మినహా ప్రాజెక్టుల విషయాన్ని గాలికొదిలేశాయి. గత ఎన్నికల్లో పలమనేరులో ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సైతం కూటమి అధికారంలోకి రాగానే ఇక్కడి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రాజెక్టుల పరిస్థితి నేటికీ ప్రతిపాదనల దశలోనే నిలిచిపోయింది.

పలమనేరు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి ఇక్కడి నదులు ప్రవహించినప్పుడల్లా నీరు వృధాగా పొరుగునే ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని మోర్దానా ప్రాజెక్టుకు చేరుతోంది. దీన్ని గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు రంగం సిద్ధం చేసింది. అయితే అప్పట్లో కోవిడ్, టెండర్లు, ప్రస్తుతం ఎన్నికల కారణంగా ఈ పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టుల పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలమయ్యేది.

3 ప్రాజెక్టుల నిర్మాణాలకు గత ప్రభుత్వంలో చర్యలు

ప్రాజెక్టుల నిర్మాణంపై గత ప్రభుత్వంలో బైరెడ్డిపల్లి మండలంలోని కైగల్ నదిపై రూ.22 కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. దీనికి భూసేకరణకు అవసరమైన టెండర్లను జరిగి టెండర్ల ప్రక్రియలో పనులు ఆగాయి. వీకోట మండలంలోని దుర్గమ్మ ఏరు ప్రాజెక్టుకు రూ.46.82 కోట్ల అంచనాను గతంలోనే ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి పంపారు. పలమనేరు మండలంలోని గంగన్నశిరస్సు ప్రాజెక్టు పనులు గతంలో మొదలై అర్ధాంతరంగా ఆగాయి. అయితే దీనిపై కాసిన ఇరిగేషన్‌శాఖ రూ.27.37 కోట్ల కొత్త అంచనాలతో పబ్లిక్ హెల్త్ శాఖకు పంపింది. అయితే అటవీశాఖ నుంచి క్లియరెన్స్ ఆలస్యమవుతున్నందున ప్రాజెక్టుకు ఇబ్బందికరంగా మారింది. ఇక బైరెడ్డిపల్లి మండలంలోని వెంగంవారిపల్లి నది విషయం కోసం ఇరిగేషన్ శాఖకు కూడా తెలియదు. మొత్తం మీద ఈ మూడు ప్రాజెక్టులు పూర్తయితే గంగనశిరస్సు ద్వారా 56 , వెంగంవారిపల్లి 40 ఎంసీఎఫ్‌టీ మొత్తం ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా 200 ఎంసీఎఫ్‌టీ దాకా నీటిని ఒడిసిపట్టొచ్చు. దీంతో సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయి.

వర్షం నీరు సముద్రంపాలు

పలమనేరు నియోజకవర్గంలోని కౌండిన్య, ఎగిరేరు, కైగల్, దుర్గమ్మఏరు, వెంగంవారిపల్లి నదులు ముఖ్యమైనవి. వర్షాకాలంలో ఈ నదుల ప్రవహించినప్పుడు 150 నుంచి 200 ఎంసీఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్లు)ల నీరు వృధాగా తమిళనాడు రాష్ట్రంలోని మోర్దానా ప్రాజెక్టుకు చేరి అపై బంగాళాఖాతంలో కలుస్తోంది. అయితే కౌండిన్య నదిపై రూ.55 కోట్ల వ్యయంతో పలమనేరు మండలంలోని కాలువపల్లి వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రిజర్వాయర్‌ను నిర్మించారు. దీంతో 50 ఎంసీఎఫ్‌టీల నీటిని ఇక్కడ నిలుపుకునేలా చేశారు. ప్రస్తుతం నదులకు ఎగువ ప్రాంతాలైన కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో బైరెడ్డిపల్లి మండలంలోని కైగల్ నదిలో ప్రస్తుతం నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీరు కౌండిన్య నదిలో చేరి తమిళనాడులోని మోర్దానా డ్యామ్‌కు వృధాగా వెళుతున్నాయి. అదే విధంగా పలమనేరు మండలంలోని ఎగిరేరి నది నీళ్లు సైతం తమిళనాడుకు చేరుతున్నాయి. వీకోట మండలంలోని దుర్గమ్మ ఏటి నీరు తమిళనాడుకే ఉపయోగపడుతున్నాయి. బైరెడ్డిపల్లి మండలంలోని వెంగంవారిపల్లి అడవి లోని ప్రాజెక్టుల్లో 55 ఎంసీఎఫ్‌టీ, కైగల్ రిజర్వాయర్ ద్వారా 45.27 టీఎంసీ, దుర్గమ్మ ఏరు ప్రాజెక్టు



బైరెడ్డిపల్లి : వృధాగా పోతున్న కైగల్ నది వరద

మరో నది ఇలా ఈ ప్రాంతంలో అన్ని నదుల నుంచి ఏటా 200 ఎంసీఎఫ్‌టీ నీరు సముద్రం పాలవుతోంది.

> ప్రభుత్వానికి రివైజ్డ్ అంచనాలు పంపించాం
>
> గంగన్న శిరస్సు ప్రాజెక్టు పనులకు అటవీశాఖ నుంచి క్లియరెన్స్ రావాల్సి ఉంది. కైగల్ ప్రాజెక్టు పనులు ప్రస్తుతం టెండర్ల దశలోనే ఉన్నాయి. దుర్గమ్మ ఏరు ప్రాజెక్టుకు ఆర్థికశాఖ క్లియరెన్స్ రావాల్సి ఉంది. రెండు ప్రాజెక్టులకు రివైజ్డ్ అంచనాలతో ఐబీఎలో అంచనాలను పెంచి ప్రభుత్వానికి పంపించాం. ఈ ప్రాజెక్టు పనులు త్వరగా మొదలు పెట్టేందుకు అవసరమైన పాలో అప్ చేస్తున్నాం.
>
> – లక్ష్మీనారాయణ, నీటిపారుదల శాఖ జేఈ



వీకోట మండలంలోని దుర్గమ్మ ఏరు ప్రవహిస్తున్న దృశ్యం



జోరుగా ప్రవహిస్తున్న కౌండిన్య నది

కూటమి హామీ ఇచ్చింది.. వదిలేసింది..

గత ఎన్నికల సందర్భంగా ఇక్కడికి వచ్చిన చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సైతం ఈ ప్రాజెక్టులను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా వీటి గురించి పట్టించుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టులకు సంబంధించిన పనులు ఎక్కడ ఆగాయో ఇప్పటికీ అక్కడే ఉన్నాయి.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

చిత్తూరు కలెక్టరేట్ : యువత అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని విజయం కళాశాల ప్రాంగణంలో మై భారత్ ఆధ్వర్యంలో సమితి స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన అధికారి మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడా పోటీల్లో రాణించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. మై భారత్ ప్రాంగీయ గణాంక అధికారి బాబురెడ్డి, విజయం కళాశాల ఏవో రాజగోపాల్‌నాయుడు, యూత్ ఫర్ సేవా అధ్యక్షుడు హరీష్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జిల్లా యువజన అధికారి

కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

తవణంపల్లె : విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఇందిర ఆదేశించారు. గురువారం మండలంలోని తొడతర హైస్కూల్, తొడతర మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. తొడతర మోడల్ స్కూల్లో పాఠశాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. డిప్యూటీఈఓతో పాటు తవణంపల్లె ఎంఈఓలు హేమలత, మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ విద్యార్థులతో ముచ్చటిస్తున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి

- వచ్చామా....వెళ్లామా అనే ధోరణితో ముగిసిన వైనం
- ప్రజా సమస్యలు పట్టని ప్రజా ప్రతినిధులు
- మొక్కుబడిగా జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అలా ముగించేశారు!





సమావేశాల్లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, విద్యాశాఖ అధికారులు అలసత్వాన్ని ప్రశ్నిస్తున్న సదుం జెడ్పీటీసీ సోమశేఖరరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశాలను మొక్కుబడిగా మార్చేశారు. జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించినప్పుడల్లా క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను వెల్లడిస్తున్నా జిల్లా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సభ్యులు ఆరోపణలు గుప్పించారు. క్షుణ్ణంగా నిర్వహించాల్సిన 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలు మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించి మమ అనిపించేశారు. జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను తూతూ మంత్రంగా నిర్వహించడంపై పలు విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ సమావేశాలకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల అధికారులు గైర్హాజరయ్యారు. ప్రతి సమావేశానికి పూర్తి స్థాయిలో అధికారులు గైర్హాజరవుతున్నా చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ఆరోపించారు. ఐదారింటి స్థాయి లేని సమావేశాలను నిర్వహించి ఎలాంటి లాభమూ లేదని జెడ్పీటీసీలు నిట్టూర్చారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, 5 వ స్థాయి సంఘం చైర్‌పర్సన్ భారతి, జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టిసారించండి

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు వైద్యాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం నిర్వహించిన నాడు-నేడు పనుల నిధులు చాలా పాఠశాలల ఖాతాల్లో ఉన్నాయన్నారు. ఆ నిధులు దుర్వినియోగం కాకుండా నిబంధనల మేరకు ఖర్చు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

హాజరుకాని కూటమి ఎమ్మెల్యేలు

జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలకు హాజరు కావాల్సిన కూటమి ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. అదే విధంగా తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి పలు శాఖల జిల్లా అధికారులు హాజరు కాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపారు. దీంతో సభ్యులు అడిగే ప్రశ్నలకు సిబ్బంది సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారు. బాధ్యతగా హాజరు కావాల్సిన జిల్లా అధికారులు గైర్హాజరు కావడంతో సభ్యులు విమర్శలు గుప్పించారు. ప్రతిసారి ఏదో ఒక సాకుతో గైర్హాజరవుతున్న జిల్లా అధికారులకు నోటీసులు జారీ చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. స్థాయీ సంఘాల సమావేశాలకు హాజరయ్యే ప్రజా సమస్యలను చర్చించాల్సిన ఎమ్మెల్యేలు ఒక్కరూ కూడా హాజరు కాకపోవడంపై విమర్శలు గుప్పించారు.

చర్చించిన సమస్యలు ఇలా....

- కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారని, ఎందుకు మంజూరు చేయడంలేదని సదుం జెడ్పీటీసీ సోమశేఖరరెడ్డి డీఆర్‌డీఏ అధికారులను ప్రశ్నించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని వాపోయారు. బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు చిత్తూరు జిల్లాలో మార్చి 31వ తేదీ వరకు అవకాశం ఇస్తే తిరుపతి జిల్లాలో మాత్రం మార్చి 6వ తేదీ వరకు సమయం ఇవ్వడం ఏమిటని ద్వామా అధికారులను ప్రశ్నించారు.
- గ్రామాల్లో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో విద్యుత్ శాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ లకు రైతులు నెలల తరబడి నిరీక్షిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.
- అన్నమయ్య జిల్లా పీలేరులో 50కి పైగా అనుమతులు ఉంటే కొత్తగా ఏర్పాటు చేసిన అక్కినపల్లి పంచాయతీని మాత్రం అన్నమయ్య వైద్యశాఖ అధికారులు లంచం కోసం సీజ్ చేశారని పీలేరు జెడ్పీటీసీ రత్నశేఖర్ ఆరోపించారు.
- జగనన్న కాలనీ ఏర్పాటుకు భూమి చదును చేసి ఎర్రమట్టి పోసి ప్లాట్లు కేటాయించగా, అందుకు ఖర్చు చేసిన నిధులను అధికారులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని పాలసముద్రం జెడ్పీటీసీ అన్నంగారు ఆరోపించారు.
- వైద్య ఆరోగ్య శాఖలో ఎంఎల్‌హెచ్‌పీ కింద విడుదల చేసిన నోటిఫికేషన్ అనుమతి లేకుండా విడుదల చేశారని ఆరోపణలున్నట్లు గుడుపల్లి జెడ్పీటీసీ కృష్ణమూర్తి అన్నారు. ఇలా చేయడం వల్ల క్షేత్రస్థాయిలో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.
- విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలను విలీనం పేరుతో ఎన్నో విక్ష చరిత్ర ఉన్న బడుల ను మూసివేయడం దారుణమని సభ్యులు మండిపడ్డారు. ఈ ఆలోచన నిర్ణయం వల్ల పేద విద్యార్థులు కిలోమీటర్ల దూరం నడవాల్సిన దుస్థితి ఎదురవుతుందని సదుం జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి విమర్శించారు. సదుం మండలంలో ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తామని విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు ఎలాంటి అటెండెన్స్ లేకుండా నష్టపోతున్నారని చెప్పారు. విద్యార్థులకు న్యాయం చేయకపోతే విద్యార్థులను తీసుకెళ్లి ధర్నా చేస్తామని హెచ్చరించారు.

బాల్య వివాహాల కట్టడికి సహకారం

చిత్తూరు కలెక్టరేట్ : బాల్య వివాహాల కట్టడికి ప్రజాప్రతినిధుల సహకారం అవసరమని తిరుపతి ఐసీడీఎస్ పీడీ వసంత అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో బాల్య వివాహాల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాల కట్టడికి ప్రజాప్రతినిధుల సహకారం ఉంటే మరింతగా కట్టడి చేయవచ్చన్నారు. ఉమ్మడి చిత్తూరులో దాదాపు 4500 కు పైగా టీనేజ్ గర్భిణులు ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. యుక్త వయసులో గర్భిణులు గా మారడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. క్షేత్రస్థాయిలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఐసీడీఎస్ అధికారులు

క్లుప్తంగా

వాహనంతో ఢీకొట్టి.. బాధితుడిపైనే దాడి

పుంగనూరు : ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఎదురుగా వస్తున్న వ్యక్తిని ఢీకొట్టి , తిరిగి బాధితుడిపైనే కుటుంబ సభ్యులతో వెళ్లి దాడిచేసి గాయపరచడంతో పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మండలంలోని గూడూరుపల్లె వద్ద జగనన్న కాలనీలో నివాసం ఉన్న యశ్వంత్(20) ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఎదురుగా నడుచుకుంటూ వస్తున్న రహంతుల్లా(25)ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రహంతుల్లా తీవ్రంగా గాయపడ్డాడు. ఇలా ఉండగా తిరిగి యశ్వంత్ తన తండ్రి సురేష్, అవ్వ మంజుల, తమ్ముడు జశ్వంత్‌తో కలిసి రహంతుల్లా ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడు రహంతుల్లా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జలపాతంలో పడి యువకుడి గల్లంతు

గంగవరం : పలమనేరు రూరల్ మండలం కాల్వపల్లి చెక్ పోస్టు సమీపంలో కళ్యాణ్ రేవు జలపాతంలో గురువారం ఓ యువకుడు పడి గల్లంతయ్యాడు. పలమనేరు పట్టణానికి చెందిన యూనిస్ (24) పట్టణంలోని ఓ చికెన్ సెంటర్‌లో పని చేస్తుంటాడు. సరదాగా జలపాతం వద్దకు వెళ్లగా అక్కడ ప్రమాదవశాత్తు జలపాతంలో పడిపోయాడు. అయితే గల్లంతైన యువకుడి కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతానికి ఆచూకీ లభ్యం కాలేదు.

గ్యారేజ్‌లో చోరీ

గంగవరం : పలమనేరు మండలం కొలమాసనపల్లి గ్రామంలోని విజయ్ కార్ గ్యారేజ్‌లో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. రూ. 2 లక్షల విలువ చేసే కార్ ఇంజన్లు, ఇంజన్ ఆయిల్ సామగ్రిని అపహరించినట్లు బాధితుడు వాపోయాడు. దీనిపై గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నాడు. దొంగతనాలు అరికట్టేందుకు గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జీఎస్టీ తగ్గింపుపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. చిత్తూరు నగరంలో గురువారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలు అవగాహన కలిగి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, డీటీసీ నిరంజన్‌రెడ్డి, ఆర్టీఓ సునీల్, ఎంవీఐలు నరసింహులు, దీపిక పాల్గొన్నారు.

ఎస్వీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావుకు అరుదైన అవకాశం లభించింది. ఇప్పటికే ఆయన ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కాగా ప్రభు త్వం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా అదనపు బాధ్యలను అప్పగించారు.



కేసులతో మీడియాను భయపెట్టలేరు



వార్తల్లో ఏవైనా అభ్యంతరం ఉంటే సరైన ఖండన ఇచ్చే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. అలా కాకుండా కేసులు పెట్టి మీడియాను భయపెట్టాలని చూడడం సరైనది కాదు. ఇది పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమే. సాక్షి ఎడిటర్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు సరైనది కాదు. పోలీసుల ద్వారా మీడియాను భయపెట్టాలని చూస్తున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇది మంచిది కాదు. మీడియా పైన కక్ష సాధింపు చర్యలు ఇకనైనా మానుకోవాలి.

– కె. గిరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్

సాక్షి మీడియాపై కేసులు అప్రజాస్వామికం



ప్రభుత్వం గత నాలుగు రోజులుగా సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. పోలీసులను ముందు పెట్టి జర్నలిస్టులను భయపెట్టాలని చూస్తున్నారు. ఇలాంటి చర్యలు మీడియా స్వేచ్ఛకు మంచిది కాదు. వార్తలపై అభ్యంతరం ఉంటే చట్టపరంగా ముందుకెళ్లాలి తప్ప ఇలా కేసులతో భయపెట్టి లొంగదీసుకోవాలని చూడడం అసాధ్యం. మీడియాను రక్షించాల్సిన వ్యవస్థలే కక్ష పూరితంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. – ఆర్.మురళి, అధ్యక్షుడు, తిరుపతి ప్రెస్ క్లబ్

మీడియా స్వేచ్ఛకు సంకెళ్లా..!



మీడియాకు సంకెళ్లు వేయడం అంటే ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేసినట్లే. పత్రికల్లో ప్రచురించే కథనాలపై కేసులు పెట్టడం అన్యాయం. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. పోలీసులను ముందు పెట్టి మీడియాను తన అదుపులోకి ఉంచుకోవాలని ప్రభుత్వం చూడడం సిగ్గుచేటు. పోలీసు కేసులతో మీడియాను కట్టడి చేయాలన్న ఆలోచన సరైంది కాదు. 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలు ఇకనైనా మానుకోవాలి.

– పి. బాలచంద్ర, జనరల్ సెక్రటరీ, తిరుపతి ప్రెస్ క్లబ్

మీడియాపై రాజకీయ కక్ష తగదు



మీడియాకు రాజకీయ కక్ష అప్రజాస్వామికం. ప్రభుత్వ వైఫల్యాలపై సాక్షిలో కథనాలు ప్రచురించారని పత్రిక కార్యాలయాలపై పోలీసులు దాడిచేయడమేంటి? ఎడిటర్‌ను బెదిరించడం, కార్యాలయంలో సోదాలు చేయడం దారుణం. మీడియాపై అధికారులు ఇలా దాడులకు పాల్పడితే అది ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలి. ఈ విధానాన్ని పాత్రికేయ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

– విజయ్ యాదవ్, జేశాప్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు

కాసుల వైద్యం

- ప్రైవేటు ఆసుపత్రుల్లో బాదుడే బాదుడు
- జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు ఆస్పత్రులు
- అనధికారిక ఆస్పత్రులు కోకొల్లలు
- డిమాండ్‌ను బట్టే కన్సల్టెన్సీ
- జ్వరమని వెళ్లినా పరీక్షే..
- ఫీజు రూ.500 నుంచి.. ఆపైమాటే
- ఐసీయూకు రూ.10 వేలు
- భయపడుతున్న ప్రజానీకం



వైద్యో నారాయణో హరి అన్నది ఒకప్పటి నానుడి.. ఎందుకంటే అప్పటిలో వైద్యుడు దేవుడిలా ఉండేవాడు.. వైద్యమూ అలాగే చేసేవారు.. నాడి పట్టుకుని రోగం ఏంటో చెప్పేవారు.. రోగిని చూసి వైద్యం చేసేవారు.. మరిప్పుడు అంతా మారిపోయింది.. రోగి చెప్పింది వినాలంటే (కన్సల్టెన్సీ) రూ.500 నుంచి రూ.1000.. మరీ డిమాండ్ ఉంటే రూ.2 వేలు.. ఒకసారి చేయి పట్టుకుంటే (ఐసీయూ) రూ.10 వేలు..ఆ తరువాత టెస్ట్‌లు.. మందులు షరా మామూలే.. రోగి నుంచి ఇష్టానుసారం పిండేస్తున్నారు.. ఎమర్జెన్సీ ఆసుపత్రుల్లో అయితే మరీనూ.. లక్షలు ఉంటేనే వైద్యం.. లేదంటే దైన్యమే.. ప్రైవేటు వైద్యంపై ప్రభుత్వ నియంత్రణ కొరవడడంతో రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారు. ఇక అనుమతులు లేని ఆస్పత్రులు రెచ్చిపోతున్నాయి.

కాణిపాకం : జిల్లాలో 1200పైగా ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. రిజిస్ట్రేషన్ కానీ ఆస్పత్రులు మరో 1000 దాకా ఉన్నాయి. అలాగే ల్యాబ్‌లు 900 ఉండగా..అనాధికారికంగా 7000పైగా నడుస్తున్నాయి. ప్రధానంగా పలు ఆస్పత్రుల్లో చూస్తే వెయ్యి..పట్టుకుంటే 5 వేలు అనేంతగా వైద్యుల తీరు మారింది. వైద్యుల వద్దకు వెళ్లి చూపించుకోవాలంటే కన్సల్టెన్సీ ధర తక్కువలో తక్కువంటే రూ.500 నుంచి ఆరంభం. రూ.2 వేలు ఉండే ఆ ధరలు ఉన్నాయి. మందులు మా త్రం నెలకు రాసేస్తారు. అంటే నెల తర్వాత వస్తే మళ్లీ డబ్బులు సమర్పించుకోవాలి. అసలు నాడి పట్టుకోకుండా రోగి లోనికి వచ్చిన సమస్య ఏమిటని అడగడం మరుక్షణం నుంచే మందులు రాసేస్తారు.ఈ కన్సల్టెన్సీ ఫీజులపై నియం త్రణ లేకపోవడంతో రోగిని పిండేస్తున్నారు. ప్రస్తుత తరం వైద్యులను చూసి ఆ తరం వైద్యు లు మారిపోయారు. డబ్బే పరమావధిగా వైద్యం చేస్తున్నారు. దీంతో రోగులు.. వారి కూడా వచ్చే బంధువులు లబోదిబోమంటున్నారు.

కమీషన్ల వ్యాపారం

అధిక శాతం ఆస్పత్రులు కమీషన్లతో లాభాలు గడిస్తున్నాయి. ఆర్‌ఎంపీ, పీఎంపీ ఆయా ఆస్పత్రుల్లో ఎన్‌రోల్ చేయించుకొని పేషెంటును రిఫర్ చేస్తే కొంత మొత్తం లేదా 40 శాతం వరకూ కమీషన్ ముట్టజెబుతున్నారు. అందుకే ఈ మధ్య నగరాల్లోని ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల్లో గ్రామీణ రోగులు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇక స్కానింగ్, ఎక్స్‌రే తదితర టెస్టులకు తమ వద్దకు పంపిస్తే లేబొరేటరీలు ఆయా ఆస్పత్రులకు 50 శాతం వరకూ కమీషన్ రూపంలో ఇస్తున్నాయి. ఫలానా ల్యాబ్‌కు మాత్రమే వెళ్లాలని ఆస్పత్రుల్లో సూచించడం, వేరే దగ్గర చేయించుకొంటే తిరస్కరించడం, స్పష్టంగా ఫలితాలు రాలేదని చెప్పడం దాదాపుగా అందరికీ అనుభవమే. దీనికి ఆ కమీషన్ల కక్కుర్తే కారణం. ఓ వ్యక్తి లిపిడ్ ప్రొఫైల్ పరీక్షకు ఓ ల్యాబ్‌కి వెళ్లారు. రూ.1200 అవు తుందని వాళ్లు చెప్పారు. ఆ వ్యక్తి డాక్టరు ఫోన్ చేసి వారికి ఇచ్చారు. తాను వేరే ఊరి డాక్టరునని, తనకు కమీషన్ వద్దని చెప్పడంతో రూ.600 మాత్రమే ల్యాబ్ వారు బిల్లు వేశారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. 'వైద్యో నారాయణో హరి' అనే నానుడు ఎందుకు కన్నీరు పెడుతోందో చెప్ప డానికి ఈ ఉదాహరణలు మచ్చు తునకలు మాత్రమే సుమా!.. రోజూ ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతూనే ఉన్నాయి.

ఇష్టారాజ్యంగా వైద్య సేవలు

చాలా వరకు రిజిస్ట్రేషన్ ఉన్న ఆస్పత్రులు ఫీజులు, వైద్యం విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. కొన్ని ఆస్పత్రులను మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇక రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఎలాంటి అనుమతి లేకుండా వైద్యంతో పాటు ఆపరేషన్లు, ప్రసవాలు చూస్తున్నాయి. ఆ అనుమతి లేని ఆస్పత్రుల్లో చాలా మంది వైద్యార్హత లేని సిబ్బంది పనిచేస్తున్నారు. కొందరు మెడికల్ షాపుల్లోనే ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులను ఏర్పాటు చేసుకుని దర్జాగా చికిత్సలు చేస్తున్నారు. కాసులు సముపార్జనే ధ్యేయంగా జరుగుతున్న ఈ దందాకు వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

అనుమతిలేని ఆస్పత్రులు

చిత్తూరు నగరంలోని సుందరయ్యవీధిలోనే పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులు ఏళ్ల తరబడి నిర్వహిస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అలాగే మిట్టూరు, కొంగారెడ్డిపల్లి, కట్టమంచి, చర్చివీధి తదితర ప్రాంతాల్లో కూడా ఈ రిజిస్ట్రేషన్‌లేని ఆస్పత్రులు దర్శనమిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మేల్కోవాల్సిన అవసరం ఉంది.

చర్యలు తీసుకుంటాం.



జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల విషయంపై నిఘా పెట్టాం. ఇదివరకే రిజిస్ట్రేషన్ ఉన్న ఆస్పత్రులతో పాటు రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రి వివరాలను సేకరించాలని ఆదేశించాం. ఆ బాధ్యత డెమో సెక్షన్ వాళ్లు చూస్తున్నారు. చిత్తూరు నగరంలో ఎక్కడెక్కడ అనుమతులు లేని ఆస్పత్రులు ఉన్నాయో చూస్తాం. అధిక ఫీజు వసూళ్లు చేసే ఆస్పత్రులపై కొరడా ఝుళిపిస్తాం. అలా జరిగితే ఎవరైనా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

ఆసుపత్రి కెళ్తే జేబు ఖాళీ..

ఇవాళ వైద్య రంగంలో కాసుల కక్కుర్తి తప్ప మానవతా దృక్పథం, నైతిక విలువలు కొరవడడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రోగి వ్యాధిని డబ్బుతో తూకం వేయడం మితి మీరిపోయింది. డాక్టర్లు టార్గెట్లు రీచ్ కావడానికి అవసరం లేకపోయినా ఎక్స్‌రే, స్కానింగ్, మందులు రాసేస్తున్నారు. ఆస్పత్రులకు పట్టుకొన్న మరో జాడ్యం మందులు (మెడిసిన్). సొంతగా ఆస్పత్రుల్లోనే మెడికల్ షాపులు ఉండడంతో ప్రిస్క్రిప్షన్ నిండిపోయే వరకూ మందులు రాసేస్తున్నారు. దీని వెనుక ఆశ్చర్యపోయే మాయ దాగి ఉంది. గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటేటివ్స్‌ని నియమించుకొని వాళ్లను డాక్టరు వద్దకు పంపించి ప్రొడక్టును ప్రచారం చేసుకోవడం జరిగేది. దీనిని ఎథికల్ మార్కెటింగ్ అనే వాళ్లు. ఆ ప్రొడక్టును ఎక్కువగా రాసినందుకు తాయిలాలుగా వచ్చేవి. ఈ పద్ధతి ఇప్పటికీ ఉన్నా బాగా తగ్గింది. ఇప్పుడు కొత్త ఒరవడి వచ్చింది. బెంగుళూరు, చెన్నైలతో పాటు పలు చోట్ల మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. ఆయా కంపెనీల నుంచి పెద్ద ఎత్తున మందులు తెచ్చి విక్రయిస్తున్నారు. ఇవి వైద్యులకు చాలా తక్కువ ధరకు వస్తాయి. వీటిని ఎక్కువ ధరకు విక్రయిస్తారు.అందుకే అవసరం ఉన్నా లేకపోయినా ఎక్కువ మందులు రాస్తుంటారు. గ్యాస్ట్రిక్ లేకపోయినా గ్యాస్ ట్యాబ్లెట్ రాసేయడం ఈ మధ్య చూస్తూనే ఉన్నాం. వైరల్ ఫీవర్‌కు యాంటి బయోటిక్ రాయకూడదు.అసలు యాంటి బయోటిక్స్ తక్కువగా సూచించాలని ఆ తరం వైద్య నిపుణులు నెత్తీ నోరు బాదుకుంటున్నారు. అయినా తమ మెడికల్ షాపుల వ్యాపారం కోసం వైరల్ ఫీవర్‌కు యాంటి బయోటిక్స్‌తో చీటీలో నింపేస్తున్నారు. కాసుల కక్కుర్తితో రాసే మందులు వ్యాధి నయం మాట అటుంచితే కొత్త రోగాలు చుట్టు ముడుతున్నాయి. చివరికి రోగి ఒళ్లు, ఇల్లు గుల్లవుతోంది.

యూపీపీఎస్సీ పరీక్షలకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : యూపీపీఎస్సీ శిక్షణపై ఆసక్తి ఉన్న అభ్యర్థులకు అనుకూలంగా చిత్తూరులో ఐఏఎస్, ఐపీఎస్ పరీక్షలకు శిక్షణ ప్రారంభించినట్లు ఎస్వీ డిగ్రీ కళాశాల చైర్మన్ ప్రసాద్‌రాజు వెల్లడించారు. గురువారం ఆ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణలకు దూర ప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థుల సౌకర్యార్థం చిత్తూరులో శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు చిత్తూరు విద్యార్థులు శిక్షణకు ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇకపై అలాంటి సమస్యలు ఉండవన్నారు. సివిల్స్‌పై ఆసక్తి ఉన్న అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తిరుపతిలోని గిండీస్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 2025–26వ సంవత్సరం బ్యాచ్‌గా ఇంటర్, ఐఏఎస్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐఏఎస్, ఎక్స్‌క్లూజ్ ఐఏఎస్ బ్యాచ్‌లను ప్రారంభిస్తున్నామన్నారు. శిక్షణపై ఈనెల 23న ఉదయం 11 గంటలకు ఎస్వీ కళాశాలలో ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గిండీస్ అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్, ఎస్వీ యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆనందరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్వీ డిగ్రీ కళాశాల చైర్మన్ ప్రసాద్‌రాజు

ముగిసిన డిగ్రీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీ టీడీ డిగ్రీ కళాశాలల్లో గురువారంతో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. దీంతో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో కే వలం 25శాతం ప్రవేశాలు మాత్రమే జరగడం విచారకరం. అలాగే తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతీ డిగ్రీ కళాశాలల్లో మాత్రం 85 శాతం సీట్లు భర్తీ కాగా, ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్ కళాశాలల్లో కేవలం 55 శాతం అ డ్మిషన్లు జరిగాయి. జిల్లాలోని అన్ని ప్రైవేటు క ళాశాలల్లో కేవలం 45శాతం అడ్మిషన్లు మాత్ర మే జరిగినట్లు యాజమాన్యాలు ఆవేదన వక్తం చేస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఆల స్యంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడమేనని మండిపడుతున్నారు. కాగా టీటీడీ డిగ్రీ కళాశాలల్లో మిగిలిన సీట్లకు వచ్చే వారం చివరి నుంచి స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్: తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 20న దీపావళి ఆస్థానం సంద ర్భంగా గురువారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రిని నీటితో శుద్ధి చేసిన తర్వాత నామకో పు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన మిశ్రమాన్ని ఆలయం అంతటా లేపనం చేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ వీఆర్.శాంతి, ఏఈఓ ఏబీ.నారాయణ చౌదరి పాల్గొన్నారు.

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

తిరుపతి సిటీ: రాష్ట్ర సాంకేతిక, విద్యాశిక్షణ మండలి టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు తిరుపతి టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్‌హ్యాండ్ పరీక్షలు వచ్చే ఏడాది జనవరి 4న, అలాగే టైప్ రైటింగ్ పరీక్షలు జనవరి 24, 25 తేదీల్లో జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు తమకు సమీపంలోని టైప్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని, నవంబర్ మొదటి వారంలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

మహిళలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

– మహిళలపై గౌరవం లేని పార్టీ టీడీపీ



మాట్లాడుతున్న గంగాధర నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం : మహిళలు అంటే గౌరవం లేని పార్టీ టీడీపీ అని గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ముద్దుకుప్పంలోని విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దళిత మహిళ అయిన తనను అవమానకరమైన రీతిలో సభ్య సమాజం తలదించుకొనేలా ఏక వచనంతో అసభ్యకర పదజాలంతో మాట్లాడటం దారుణమన్నారు. ఈ సృష్టికు మూలం మహిళ అలాంటి వారి గురించి పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడటం మహిళలందరినీ అవమానించినట్లేనని అన్నారు. తన చీరల గురించే మాట్లాడం కంటే నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై మాట్లాడాలని, వాటిని పరిష్కరించాలన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే సహకరిస్తాం, అంతేకానీ మహిళల గురించి తక్కువ చేసి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మహిళలను అవమానిస్తూ మాట్లాడటాన్ని జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మహిళ లోకానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యాపారి మృతి

పుంగనూరు : మదనపల్లె పట్టణంలో మెడికల్‌షాపు నిర్వహిస్తున్న శ్రీకాంత్ (36) ఈనెల 6న అదృశ్యమై , గురువారం పుంగనూరు సమీపంలో శవమై తేలాడు. ఈ సంఘటన మదనపల్లె, పుంగనూరు రెండు ప్రాంతాలలో సంచలనం రేకెత్తించింది. శ్రీకాంత్‌ను హత్య చేశారా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్నది పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం , చిత్తూరు బస్టాండ్ సమీపంలో మెడికల్ షాపు నిర్వహించుకుంటున్న శ్రీకాంత్ ఈనెల 6న అదృశ్యమైయ్యాడు. ఇంటికి రాకపోవడంతో అతడి తల్లిదండ్రులు మదనపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసును నమోదు చేశారు. ఇలా ఉండగా శ్రీకాంత్ మృతదేహం పుంగనూరు మండలం యాతలవంక సమీపంలోని పంపు హౌస్ వద్ద నీటిలో తేలి ఉండటాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టంకు తరలించి, మదనపల్లె పోలీసులతో దర్యాప్తు విషయమై చర్చిస్తున్నారు. కాగా శ్రీకాంత్ మృతదేహానికి కాలి చెప్పులు కూడా అలాగే ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులు, స్నేహితుల ద్వారా పోలీసులు వాస్తవాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

ఓబీసీల హక్కుల సాధనే లక్ష్యం

తిరుపతి కల్చరల్: ఓబీసీల హక్కుల సాధనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని సౌత్ ఇండియా ఓబీసీ వె ల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో ఈనెల 12వ తేదీన జరిగిన సౌత్ ఇండి యా ఓబీసీ సెమినార్‌లో దక్షిణాదితోపాటు ఉత్తరాది రాష్ట్రాల ఓబీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొని, ఓబీసీ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయడంతోపాటు సౌత్ ఇండియా ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో జనగణనలో కులగణన శాస్త్రీయ పద్ధతిగా చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన తమ వాటా హక్కు లను తమకు కేటాయించాలన్నారు. తెలంగాణ తరహాలో 42 శాతం స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయింపులు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యకర్తల కోసమే డిజిటల్ బుక్



కోటి సంతకాల సేకరణలో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, నాయకులు

బంగారుపాళెం : కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న అన్యాయాలకు డిజిటల్ బుక్ సమాధానం చెబుతుందని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నల్లంగాడు, శెట్టేరి, తూంపాయనపల్లె గ్రామ పంచాయతీలో గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీ నియాయక సమావేశాలను డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలకు గ్రామ, అనుబంధ విభాగాల కమిటీలో ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కష్టపడి పనిచేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కుమార్ రాజా, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు లలిత కుమారి, సర్పంచ్ ధనుంజయరావు, ఉపసర్పంచ్ శంకర్, ఎంపీటీసీ ఉషశ్రీ, మాజీ సింగిల్ విండో, ఏఎంసీ అధ్యక్షులు దత్తాత్రేయరెడ్డి, కృపాసాగర్‌రెడ్డి, రాష్ట్ర సామాజిక మాధ్యమాల సంయుక్త కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవిందరాజులు, జిల్లాట్రేడ్ యూనియన్ కార్యదర్శి రఘుపతిరాజు, సీనియర్ నాయకులు పాలాక్షిరెడ్డి, థామస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజ, యూత్ అధ్యక్షుడు గజేంద్ర పాల్గొన్నారు.